# హారర్....

"పోస్టు!—" గుమ్మంలోంచి గాఠిగా కేక వినబడింది.

అది వినగానే నారాయణ ముఖం పాలిపోయింది. ఎడమ కన్ను అదిరింది. గుండె భారంగా కొట్టుకోడం మొదలయింది.

తడబడే అడుగుల్తో గుమ్మంవైపు అడుగులు వేశాడు. అక్కడ నిలబడి ఉన్న పోస్టుమ్యాన్‌ని చూస్తుంటే యములాడ్లా కనిపించాడు నారాయణ కంటికి.

నారాయణని చూస్తూనే పోస్టుమ్యాన్ చెవులదాకా నవ్వాడు.

"సార్.....మీ నవల తిరిగొచ్చినట్టుంది...." చేతిలోని పెద్ద పార్సిలుని నారాయణకు అందిస్తూ అన్నాడు.

నారాయణ ముఖం మరీ పాలిపోయింది.

"నవలేనా?...." పోస్టుమ్యాను నవ్వాపుకోడానికి శతవిధాలా ప్రయత్నిస్తూ అడిగాడు....ఊహు....నవ్వు ఆగేలా లేదు....నవ్వాపుకుందామని చొక్కా ఎత్తబోతే బుజానికి తగిలించుకుని ఉన్న ఉత్తరాల సంచి అడ్డొచ్చి చొక్కా లేవలేదు.

"ఊ....తగలడు...." నారాయణ తన భుజం మీది టవల్‌ని పోస్టుమ్యానుకి అందించాడు.

పోస్టుమ్యాను ఆ టవల్‌ని నోట్లో కుక్కుకుని నవ్వాపుకున్నాడు.

"నువ్విట్టా నవ్వావంటే నేను నవల్రాయను....రాసినా పత్రికాఫీసులకి పోస్టుద్వారా పంపను....స్టాంపు లంటించిన కవరు జతపరచను.... అంతే" గుర్రుగా చూస్తూ అన్నాడు నారాయణ.

పార్సిలు తిరిగి ఇస్తున్న నాకే ఇంత నవ్వొచ్చిందంటే మరి ఇది చదివిన ఎడిటర్‌గారికి ఇంకెంత నవ్వొచ్చిందో!! —"

పోస్టుమ్యాను మళ్ళీ నవ్వుతో గిలగిలలాడి పోయాడు.


“పిచ్చి కళలు పోకుండా టవల్ నోట్లో పెట్టుకో....” కయ్....మన్నాడు నారాయణ.

పోస్టుమాన్ టవల్‌ని నోట్లో కుక్కుకుని నవ్వాపుకున్నాడు.

“ఇంకొస్తా సార్ ...హీ....” పోస్టుమాన్ రెండడుగులు ముందుకు వేశాడు.

“టవలిలా ఇచ్చి తగలడు —” అరిచాడు అక్కసుతో నారాయణ.

సమయానికి టవలిచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుకుని పోస్టుమ్యాను వెళ్ళి పోయాడు.




నారాయణ కొద్ది నిముషాలదాకా ఆలోచనల్లో మునిగిపోయాడు.

తాను నవలలు బాగానే రాస్తున్నాడు.మరి అవెందుకట్లా తిరిగొచ్చేస్తున్నాయ్?....ఎడిటర్లకి తన నవలలు ఎందుకు నచ్చడం లేదు.

ఇంతలో అతని భార్య రమణి అక్కడికి వచ్చింది.

"ఏమండోయ్....ఆఫీసుకి టైం అయ్యింది. ఈ వేళ ఆఫీసుకి వెళ్ళరా ఏంటి?...." అంది గట్టిగా.

ఆమె కేకకి ఈ లోకంలోకి వచ్చిపడ్డాడు నారాయణ.

"ఊ?!...." అన్నాడు,

"చేతిలో ఆ ప్యాకెట్టేవిటి! .... తిరిగొచ్చిన నవలేనా? .... అలా అడుగుతూ నారాయణకి కనబడకుండా అటుతిరిగి నవ్వుకోసాగింది రమణి.

నారాయణకి చిర్రెత్తుకొచ్చింది.

"ఊ....ఊ....చూస్తున్నా....నీ చీర కొంగునోట్లో దోపుకొని ఇటుతిరుగు...." అన్నాడు కోపంగా.

రమణి చీరకొంగు నోట్లోదోపుకుని ఇటువైపుకి తిరిగింది.

"నబబ దిదిగొద్దిందా?" అంది చీరకొంగు నోట్లో ఉంచుకునే.

"అఘోరించావ్‌లే గాని అన్నం వడ్డించు ఆఫీసుకు టైమైపోతూంది.

"ఒబే (సరే)" అంది రమణి నోట్లో చీరకొంగును ఉంచుకునే.

నారాయణ భోజనం చేసి బస్సుస్టాండుకి వెళ్ళి క్యూలో నిలబడ్డాడు. ఆఫీసు బస్సు రావడానికి ఇంకా పది నిముషాల టైం ఉంది.

క్యూలో నారాయణ ముందు నిలబడి ఉన్నాయన ఒకటే వణికిపోతున్నాడు.

"ఊహెహూ....ఓఓఓ...."

నారాయణ తనముందు నిల్చున్నతను వణకడం గమనించాడు.

నెత్తిన ఎండ మాడ్చేస్తుంటే ఈయనేంటి ఇలా వణికిపోతున్నాడు!....

"ఏంటిసార్ రామ్మూర్తిగారూ....అలా వణికిపోతున్నారు? చలిజ్వరంగానీ వచ్చిందా?" అతన్ని పలకరించాడు రామ్మూర్తి,

అబ్బ....చలిజ్వరం ఏమీ లేదండీ...." గడగడా వణుకుతూ జవాబిచ్చాడు రామ్మూర్తి.

"మరి ఇంత ఎండలో అలా వణికి పోతున్నారేం?"

"ఏం వణకడమో .... ఛస్తుంటే .... మాయదారి నవల్లొచ్చి పడ్డాయి...."

నారాయణకి అర్థం కాలేదు.

"నవలలేంటి?!...."

"అదేనండి ఓ వారపత్రికలలో సీరియల్ నవల చదువుతున్నా.... ఎంత భయంకరమైన నవలనుకున్నారు?....అది చదువుతుంటే భయంతో ఒళ్ళు గగుర్పొడుస్తుంది....చదువుతున్నంత సేపూ ఒహటే వణుకుడు.... చదివిన కాస్సేపు దాకా కూడా ఒహటే వణుకుడు...."

"అంత భయంకరమైన నవలా అది?" నారాయణ ఆశ్చర్యంగా నోరు తెరిచాడు.

"మరి!....రెండు దెయ్యాల కథ....హీరో దెయ్యమే....హీరో యినూ దెయ్యమే....అవి రెండూ స్మశానంలో ప్రేమించుకుంటాయి....

నాసామిరంగా—రచయిత వాటి ప్రేమను ఎంత చక్కగా వర్ణించాడంటే....చదూతుంటే ఎక్కడ గుండాగి ఛస్తామో అని భయం వేస్తుంది—"

"అంత భయంకరమైన నవలలు ఎందుకు చదవాలి?—"

"భలేవారే—మనిషన్న తరువాత సీరియల్ నవలలు చదవకపోతే ఎలా?—" ముక్కున వేలేసుకున్నాడు రామ్మూర్తి.

"నిజమే ననుకోండి—కానీ హారర్ సీరియల్ కాకుండా వేరే పత్రికలోని సీరియలేదైనా చదవలేక పోయారా!—"

రామ్మూర్తి ఎవడ్రా నువ్వు అన్నట్టు నారాయణ వంక చూశాడు.

"హారర్ లేని సీరియల్సు ఎక్కడున్నాయండీ—అన్ని పత్రికల్లో హారరే—ఒక పత్రికలో దెయ్యాల సీరియల్. ఒక పత్రికలో హత్యలు, రేపులు ఉండే సీరియల్, ఇంకో దాంట్లో మాంత్రికులూ, బలులూ ఉండే సీరియల్, మరోదాంట్లో ఇంకోటి—పుస్తకం తీస్తే చాలు వణికిపోవాల్సిందే—అటు చూడండి — క్యూలో నిలబడి ఉన్నవాళ్ళ

ఎలా వణుకుతున్నారో—వాళ్ళంతా ఏదో ఒక సీరియల్ ఇంటిదగ్గర చదివొచ్చి ఇక్కడ నిల్చున్నారు."

నారాయణ క్యూలోని మనుష్యుల్ని గమనించి చూశాడు. క్యూలో ఉన్నవాళ్ళల్లో చాలామంది గజగజ వణుకుతున్నారు.

పాఠకులు వీటినే లైక్‌చేస్తున్నారు. అందుచేత ఇవే వేస్తున్నాం అని ఎడిటర్లు అంటున్నారు. కానీ పత్రికల్లో ఏ సీరియలు పడ్తే దాన్ని చదువుతాం అని పాఠకులు అంటున్నారు—అంచేత అన్నీ హారర్ నవలలే—" అన్నాడు వణికిపోతూ రామ్మూర్తి.

నారాయణకి జ్ఞానోదయం అయినట్టు అనిపించింది.

ఇకనుండి తానుకూడా హారర్, క్రైం, సస్పెన్స్, నవలలు రాయాలి—అప్పుడు ఎడిటర్లు తన నవలని తప్పకుండా యాక్సెప్ట్ చేస్తారు—పబ్లిషర్లు మీ నవలని నాకివ్వండి నాకివ్వండి అంటూ తన చుట్టూ తిరుగుతారు!!...."

"యాహూ—" సంతోషం పట్టలేక గట్టిగా అరిచాడు నారాయణ.

వెనువెంటనే "కెవ్వు" మని అరిచి మూర్ఛబోయింది క్యూలో నిల్చున్న ఓ అమ్మాయి.

"ఏంటయ్యా ఆ అరుపు—ఆ ఆడకూతురెవరో చూడు జడుసుకుని ఎలా మూర్ఛబోయిందో—" ఇద్దరు ముగ్గురు నారాయణని కేకలేశారు.

"అబ్బే—ఆ అమ్మాయి ఆయన అరుపుకి మూర్ఛపోలేదులెండి—క్యూలో నిలబడి 'పిశాచ బంధం' అనే సీరియల్ నవల చదువుతూ భయంతో మూర్ఛపోయింది" అని సర్ది చెప్పాడు క్యూలో ఆమె వెనకాలే నిల్చున్నవాళ్ళు.

నారాయణకి ఆశ్చర్యం కలిగింది. హారర్ నవలల్లో ఎంతటి ఎఫెక్ట్ ఉంది?,—నా నవల చదివికూడా జనం ఇలానే వణికి చస్తారు—

"యాహూ —" మళ్ళీ సంతోషంతో గావుకేక పెట్టాడు.

అదే సమయంలో అక్కడికి వచ్చింది ఆఫీసు బస్సు. డ్రైవరు నారాయణ పెట్టిన గావుకేకకి భయపడి, కంగారుపడి బస్సు ఆపకుండా వెళ్ళిపోయారు.

క్యూలో ఉన్న అందరూ నారాయణని చెడ తిట్టారు.

o o o

నారాయణ హారర్ సబ్జక్టు తీసుకుని నవల రాయడం మొదలు పెట్టాడు. ఒకరోజు అతని స్నేహితుడు సగం రాసిన ఆ నవలని చూసి ఆశ్చర్యపోయాడు.

"నువ్వు స్వంతంగా రాస్తున్నావా ఈ నవలని!"

"అవును —" అన్నాడు గర్వంగా నారాయణ.

"హోరి ఎంత అమాయకుడివిరా బాబూ నువ్వు —" ఘొల్లుమని నవ్వాడు అతని స్నేహితుడు.

నారాయణ బిక్కమొహం వేశాడు. హారర్ నవలలు, క్రైం నవలలు ఎప్పుడూ స్వంతగా రాయకూడదనీ—ఇంగ్లీషు నవలలు కాపీకొట్టి రాసెయ్యాలనీ హితభోధ చేసి వెళ్ళిపోయాడు అతని స్నేహితుడు.

నారాయణ మంచి ఇంగ్లీషు నవలల కోసం ఊళ్ళోని అన్ని షాపులూ తిరిగాడు. కాని ఎక్కడా దొరకలేదు. ఎవరు చూసినా "ఇప్పుడే ఒక రచయిత కొనుక్కెళ్ళాడు సార్ — అర్రె—ఇప్పుడే ఓ రచయిత్రి హోల్‌సేల్‌గా కొనుక్కెళ్ళింది సార్" అనే వాళ్ళే.

సెకండు హాండు షాపులకెళ్ళి ఇంగ్లీషు నవలలు గురించి అడుగుతే "ఏంటిసార్—మీరు కథలు రాస్తారా!—" అంటారూ అడిగేవాళ్ళే గాని ఒక్కడూ నా దగ్గర ఇంగ్లీషు నవలుంది — తీస్కెళ్ళండి అనేవాడు ఒక్కడూ లేడు.

చివరికి ఒక పుస్తకాల షాపువాడితో కాంట్రాక్టు ఒకటి కుదుర్చుకున్నాడు నారాయణ. అదేమిటంటే —

షాపువాడు తెప్పించే ప్రతి ఇంగ్లీషు నవలని నారాయణకి ముందు తెచ్చి ఇస్తాడు. నారాయణ వద్దంటేనే ఆ నవలని ఇంకో రచయితకి ఇస్తాడు. ఇందుకు ప్రతిఫలంగా నారాయణ రాసిన నవలమీద పత్రిక నుండి, పబ్లిషరునుండి వచ్చే రాయల్టీలలో సగం నారాయణ ఆ పుస్తకాల షాపువాడికి ఇవ్వాలి. అంతేకాదు పొరబాటున ఆ ఇంగ్లీషు నవల ఆధారంగా రాసిన నవలని ఎవరైనా సినిమా కింద తీస్తే ఆ రాయల్టీలో నాలుగోవంతు షాపు వాడికి ఇచ్చెయ్యాలి.

నారాయణ విరగబడి ఇంగ్లీషు నవలలు తెలుగులో రాసెయ్యడం మొదలుపెట్టాడు. పత్రికలు కూడా అతని నవలలు వెయ్యడం మొదలు పెట్టాయి. కాని ఆ జోరు ఎన్నాళ్లో లేదు. పత్రికల వాళ్ళు హారర్ నవలల్ని వెయ్యడం తగ్గించేశారు. కొన్ని పత్రికలు వాటిని పూర్తిగా మానుకున్నాయి. దాంతో నారాయణ పరిస్థితి మళ్ళీ మామూలైంది. ఇన్నాళ్ళూ కాపీకొట్టి రాయడం అలవాటైన అతనికి స్వంతంగా ఆలోచించి రాయడం అలవాటు తప్పిపోయింది. అతనికే కాదు. అతనిలా రాసే అందరూ నవలలు స్వంతంగా ఆలోచించి రాయడం చేతకాక రాయటం మానుకున్నారు.

ఇంతకీ పత్రికలవాళ్ళు హారర్ నవలలు ప్రచురించడం ఎందుకు మానుకున్నారో చెప్పలేదు కదూ,

పాఠకులు తెలివిమీరడం వల్ల!—అదెలాగంటే—డూప్లికేటు నవలలు చదివేకంటే ఒరిజినల్ నవలలేచదవడంమేలనిపత్రికలు కొనడం మాని డైరెక్టుగా ఇంగ్లీషు నవలలే చదవడం మేలని పత్రికలు కొనడం మాని డైరెక్టుగా ఇంగ్లీషు నవలలే పాఠకులు చదవడం మొదలుపెట్టారు.

అందువల్ల పత్రికల సేల్సు పడిపోసాగాయి. ఆ విధంగా హారర్ క్రైం నవలలకి బ్రేక్ పడింది.